సాక్షి
పార్వతీపురం మన్యం
శనివారం | 30 | నవంబర్ | 2024



మహిళా మణులకు సెల్యూట్..!
మహాకవి గురజాడ రచించిన కన్యాశుల్కం నాటకాన్ని కొందరు మహిళా కళాకారులు ప్రదర్శిస్తూ పాత్రలకు జీవం పోస్తున్నారు. ప్రశంసలు అందుకుంటున్నారు. - 8లో



విలువలతో కూడిన విద్యను నేర్వాలి
ప్రస్తుతం విద్యావ్యవస్థ అధ్వానంగా మారిందని, విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాల్సిన అవసరం విద్యార్థులకు ఉందని కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు సూచించారు. - 8లో



రామతీర్థంలో సహస్ర దీపాలంకరణ
ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని సీతారామ స్వామివారి దేవస్థానంలో స్వామివారికి సహస్ర దీపాలంకరణ సేవ శుక్రవారం కనుల పండువగా సాగింది. - 8లో

న్యూస్‌రీల్

గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: జిల్లా మీదుగా మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల అక్రమ రవాణాకు అడ్డుకట్టవేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లాస్థాయి మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల రవాణా నివారణకు పోలీస్, అటవీ, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా చర్యలు తీసుకోవాలన్నారు. బస్సులు, రైల్వే స్టేషన్లలో విస్తృత తనిఖీలు నిర్వహించాలని సూచించారు. చెక్ పోస్టుల వద్ద సీసీ కెమెరాలు, డ్రోన్స్ వినియోగించి మరింత నిఘా పెంచాలని కోరారు. సారా తయారీ కేంద్రాల నిర్వాహకులకు పీడీయాక్ట్, బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నిర్మూలనే ధ్యేయంగా పోలీస్ యంత్రాంగం చర్యలు చేపట్టిందన్నారు. లారీలు, బస్సులు, రైలు ద్వారా రవాణాచేస్తున్న వారిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశామన్నారు. అవసరమైన చోట స్నిఫర్‌డాగ్స్, చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలను వినియోగిస్తున్నామన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ డాక్టర్ ఒ.దిలీప్‌కిరణ్, అటవీశాఖాధికారి జీఏపీ ప్రసూన, పాలకొండ డీఎస్పీ రాంబాబుతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

హెడ్మాస్టర్ మృతి బాధాకరం



శ్రీనివాసరావు భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: పట్టణానికి చెందిన హెడ్మాస్టర్ సిరిపురం శ్రీనివాసరావు మృతి బాధాకరమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. గుండెపోటుతో మరణించిన శ్రీనివాసరావు అంత్యక్రియలు శుక్రవారం ఉదయం పాలకొండం పట్టణంలో నిర్వహించారు. ఈ అంత్యక్రియల్లో విక్రాంత్ పాల్గొని సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరితో మంచిగా ఉండే ప్రధానోపాధ్యాయుడి మరణం విషాదకరమన్నారు. ఎస్ఎల్‌డీపీ శిక్షణ ఒత్తిడితో ఆయన మరణించడం దురదృష్టకరమని తెలిపారు. అంత్యక్రియల్లో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొని కన్నీటివీడ్కోలు పలికారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం




పంటలను పరిశీలిస్తున్న డీపీఎం షణ్ముఖరాజు

పార్వతీపురంటౌన్: ప్రకృతి వ్యవసాయం రైతుకు లాభదాయకమని డీపీఎం షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని పెద్దబొండపల్లి, లచ్చరాజుపేట గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంలో సాగుచేసిన పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. రబీలో మినుము, పెసర పంటల్లో అంతర పంటలుగా వరుస క్రమంలో మొక్కజొన్న, గోంగూర, ఆముదం, గోరుచిక్కుడు, బెండ, తెల్ల జొన్న, కంది, ముల్లంగి, బొబ్బర తదితర పంటలను సాగుచేయడం వల్ల అదనపు ఆదాయం వస్తుందన్నారు. ప్రధాన పంటకు తెగుళ్ల తాకిడి తగ్గుతుందన్నారు. ఆధునిక సాగు పద్ధతుతో పెట్టుబడి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌టీఓజీ హేమసుందర్ పాల్గొన్నారు.

కొండను మింగేసి.. ఆధారం లాగేసి..!

- గిరిజనులు సాగుచేసుకునే డీ పట్టా భూములపై పెద్దల కన్ను
- ఆక్రమణకు స్కెచ్
- కొండవాగును, చెరువును చదునుచేసేసిన వైనం
- ఆక్రమణదారులకు సాలూరు నియోజకవర్గ టీడీపీ నేతల ఆశీస్సులు!
- గిరిజనుల సాగులో ఉన్న భూములపైనా 'అధికార' దర్పం



రోడ్డు వేసేందుకు చదును చేశారా..? అన్నట్లు కనిపిస్తున్న ఈ ప్రాంతమంతా కొండవాగు మార్గం. వర్షం కురిసిన సమయంలో కొండమీదుగా జాలువారే నీరంతా ఈ వాగు గుండా దిగువనున్న జామి చెరువులో చేరుతుంది. ఈ చెరువు నీటిని ఉపయోగించే పలువురు గిరిజనులు జీడి, మామిడి వంటి మొక్కల పెంపకంతోపాటు పోడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇప్పుడు నీరెళ్లే మార్గాన్ని చదును చేయడంతో ఆవేదన చెందుతున్నారు.



'చిత్రంలో తాను సాగుచేసిన జీడిమొక్కలను చూపుతున్న గిరిజన రైతు పేరు కొటిశ నారాయణరావు. కొయ్యకొండవలస గ్రామ సమీపంలో కొండనే ఆధారంగా చేసుకుని, దాదాపు పదేళ్లకుపైగా పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. జీడి మొక్కలు వేశాడు. ఇప్పుడు వాటిని తీసేయాలని బాగువలసకు చెందిన వ్యాపారి, మరి కొందరు టీడీపీ పెద్దలు ఒత్తిడి తెస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

'ఇదే జామి చెరువు. ఒకప్పుడు నీటితో కళకళలాడేది. ఇప్పుడు దీనిని కూడా కప్పేసి, కబ్జా చేసేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. కొంతమేర చదును పనులు కూడా జరిగిపోయాయి. ఈ చెరువు తవ్వడం వెనుక కూడా ఒక కథ ఉంది. గతంలో కొండవాగు నుంచి వచ్చే నీరంతా సమీపంలో ఉన్న కొయ్యకొండవలస గ్రామంలోకి వచ్చేది. ఆ నీటికి అడ్డుకట్ట వేసేందుకు చెరువును తవ్వారు. మరో విషయం ఏమిటంటే.. గతంలో ప్రభుత్వం తరఫున ఈ చెరువులో ఉపాధి పనులు చూడా చేశామని గ్రామస్తులు చెబుతున్నారు.



సాక్షి, పార్వతీపురం మన్యం/సాలూరు:

గిరిజనుల సాగులో ఉన్న పోడు, డీ పట్టా భూములపై సాలూరు మండలం బాగువలసకు చెందిన కొంతమంది వ్యక్తుల కన్నుపడింది. రెవెన్యూశాఖ అండదండలు కాస్త ఉండటం.. అధికార తెలుగుదేశం పార్టీ నేతల సంపూర్ణ ఆశీస్సులు తోడు కావడంతో కొండ మార్గాన్నే ఎంచక్కా చదును చేసేశారు. కొండవాగును కప్పేశారు. చెరువును సైతం చెరబట్టేందుకు స్కెచ్ వేసేశారు. అంతా సక్రమంగా జరిగిపోతోందన్న సమయంలో.. అక్కడే పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులు అడ్డుపడ్డారు. తమ అధికార దర్పంతో అమాయక గిరిజనులనూ వారు భయపెట్టారు. తాతతండ్రుల కాలం నుంచీ సాగులో ఉన్న గిరిజనుల పోడు భూములనూ ఖాళీ చేసేయాలని హుకుం జారీ చేశారు. విషయం కాస్త బయటకు పొక్కడంతో.. మేల్కోక తప్పదనుకున్నారో ఏమో... రెవెన్యూ అధికారులు అంతా అయిపోయాక తీరిగ్గా హెచ్చరిక బోర్డు పాతారు.

గిరిజనుల భూములను కాజేసేందుకు స్కెచ్..

సాలూరు–బొబ్బిలి మండలాల సరిహద్దు గ్రామాలైన చెల్లువలస, కొయ్యకొండవలస మధ్య కొండ దిగువన ఉన్న కొంత ప్రభుత్వ భూమిని, గిరిజనుల సాగులో ఉన్న భూములను కాజేసేందుకు సాలూరు మండలం బాగువలసకు చెందిన ఇద్దరు వ్యక్తులు ప్రణాళిక వేశారు. టీడీపీ నేతల అండదండలతోనే వీరు బరితెగించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొండను ఆనుకుని వస్తున్న కొండవాగును కప్పేశారు. నిమ్మలపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 27/1 నుంచి 27/7 వరకు.. 28/1,2 వరకు మొత్తం డీపట్టా భూములేనని రెవెన్యూ అధికారులే చెబుతున్నారు. ఇక్కడ సుమారు 30 ఎకరాల మేర చదును చేసి, ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని గిరిజనులు వాపోతున్నారు. కొద్ది రోజుల నుంచి జేసీబీ సాయంతో 30 అడుగుల లోతులో కొండ దిగువ ప్రాంతాన్ని చదును చేశారు. కొండవాగుతోపాటు.. దిగువన ఉన్న జామి చెరువునూ కప్పేసేందుకు సిద్ధమయ్యారు. పోడు వ్యవసాయం చేసుకుంటున్న బద్నాన గంగులు, కొటిశ నారాయణరావు, రామన్నదొర తదితర గిరిజనులు అడ్డుకోవడంతో రాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా పనులు కొనసాగించారు. ఇదేంటని ప్రశ్నిస్తే.. ఈ భూమంతా వారు కొనుగోలు చేసినట్లు చెబుతున్నారని.. ఎన్నో ఏళ్లుగా తమ సాగులో ఉన్న జీడి, మామిడి వంటి చెట్లనూ తొలగించాలని భయపెడుతున్నారని గిరిజనులు వాపోతున్నారు.



ఇవి డీపట్టా భూములంటూ రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

టీడీపీ అండదండలతోనే...

ఆక్రమణకు పాల్పడుతున్న బాగువలసకు చెందిన ఇద్దరు వ్యక్తులూ తెలుగుదేశం పార్టీకి చెందినవారేనని గ్రామస్తులు చెబుతున్నారు. వీరికి రెవెన్యూ అధికారుల మద్దతుతోపాటు.. నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేతల ఆశీస్సులు పుష్కలంగా ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వీరిపై గతంలోనూ పలు భూకబ్జాల ఆరోపణలు ఉండడం గమనార్హం. ఆక్రమణల విషయం బయటకు రావడంతో ఇటీవలే బొబ్బిలి రెవెన్యూ అధికారులు ఈ స్థలంలో హెచ్చరిక బోర్డు పెట్టడం విశేషం.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

గిరిజనులపై దౌర్జన్యం చేసి, వారు సాగు చేస్తున్న ప్రభుత్వ భూములను చదును చేసి స్వాధీనం చేసుకోవాలనుకోవడం సరికాదు. బాగువలస గ్రామానికి చెందని ఇద్దరు వ్యాపారులు యంత్రాలతో సుమారు పదెకరాల్లో భూమిని చదును చేసి, సరిహద్దు రాళ్లు వేసుకున్నారు. వీరిపై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేయాలి. ఆ భూమిని గిరిజనులకు పంచాలి.

– మర్రి శ్రీనివాసరావు, గెమ్మల జానకీరావు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం

జీడి, మామిడి మొక్కలు వేసుకుని బతుకుతున్నాం



కొండను ఆనుకుని ఉన్న అటవీ భూమిలో ఏళ్లుగా జీడి, మామిడి తోటలు సాగుచేసి బతుకుతున్నాం. మా పెద్దల నుంచీ వీటినే నమ్ముకుని ఉన్నాం. ఇప్పుడు కొంతమంది వచ్చి ఆ స్థలం వారిదంటున్నారు. మా చెట్లను వెంటనే తీసేయాలని అంటున్నారు. మా పొట్టలు కొట్టేస్తామంటే ఎలా?

– బద్నాన గంగులు, గిరిజనుడు



కొండవాగు మార్గాన్ని చదును చేశాక ఇలా..

డీఆర్వోగా హేమలత

- మరోసారి మార్పు
- కేఆర్‌ఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్‌గా ధర్మచంద్రారెడ్డి



హేమలత

పార్వతీపురం: జిల్లా రెవెన్యూ అధికారిగా కనుగుల హేమలతను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లాకు మరోసారి ఆ పోస్టులో ఎవరూ రాకుండానే మార్పు చేసినట్లయ్యింది. సాధారణ ఎన్నికలకు ముందు జిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేసిన జె.వెంకటరావు బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆ పోస్టు ఇన్‌చార్జిలతోనే నడుస్తోంది. గత రెండు దఫాలు జరిగిన డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో జిల్లాకు డీఆర్వోలను నియమించినా వారెవరూ ఇక్కడ బాధ్యతలు స్వీకరించలేదు. విధుల్లో చేరకుండానే బదిలీ చేయించేసుకున్నారు. కొన్నాళ్లు కేశవనాయుడు ఇన్‌చార్జిగా వ్యవహరించగా, ఆయన బదిలీ తరువాత ప్రస్తుతం సబ్‌కలెక్టర్ ఆ బాధ్యతలను అదనంగా నిర్వహిస్తున్నారు. మరోసారి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో వెయిటింగ్‌లో ఉన్న హేమలతను పార్వతీపురం మన్యం జిల్లా డీఆర్వోగా నియమించారు. ఆమె గతంలో పార్వతీపురం ఆర్డీఓగా పనిచేశారు. అలాగే కేఆర్‌ఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్‌గా పి.ధర్మచంద్రారెడ్డి నియమితులయ్యారు.

శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి కృషి



కానిస్టేబుల్ అందజేసిన వినతిని పరిశీలిస్తున్న ఎస్పీ మాధవ్ రెడ్డి

పార్వతీపురంటౌన్: పోలీస్ సిబ్బంది శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డే (గ్రీవెన్స్ డే)ను శుక్రవారం నిర్వహించారు. వినతులు స్వీకరించారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో ఎస్పీ సీసీ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఏఆర్ డీఎస్పీకి బదిలీ

పార్వతీపురంటౌన్: జిల్లా ఏఆర్ డీఎస్పీ వెంకట అన్నారావును బదిలీచేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో గుంటూరు జిల్లా నుంచి కె.థామస్ రెడ్డిని నియమించింది. బదిలీపై వెళ్తున్న అన్నారావును ఎస్పీ ఎస్.వి. మధవ్‌రెడ్డి, అదనపు ఎస్పీ డాక్టర్ దిలీప్‌కిరణ్ అభినందించారు.

సంబంధమే లేదట!

- పీజీఆర్‌ఎస్ ఫిర్యాదుపై ఐటీడీఏ వివరణ
- గిరిజన గురుకుల ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం

సాక్షి, పార్వతీపురం మన్యం: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ కొద్దిరోజులుగా విధులు బహిష్కరించి, శాంతియుత నిరసన చేపడుతున్న గిరిజన గురుకులాల ఉపాధ్యాయులకు ప్రభుత్వం షాక్ ఇచ్చిన విషయం విదితమే. ఉపాధ్యాయుల సమ్మెతో గురుకులాల్లో బోధనకు ఆటంకం కలుగుతుందని తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో దిగివచ్చి, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో జూనియర్ సిబ్బందిని డిప్యుటేషన్‌పై పంపాలని నిర్ణయించి తన ఉద్దేశాన్ని చాటుకుంది. గురుకుల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఒకలా షాక్ ఇస్తే.. జిల్లా అధికారులు సైతం మరో విధంగా ఝులక్ ఇచ్చారు. అసలు వీరి డిమాండ్ల పరిష్కారం తమ పరిధిలోనే ఉండదని ఒక్క మాటలో తేల్చేస్తూ.. ఏ విధమైన సందేహాలు, సమస్యలు తీర్చాలన్నా నేరుగా రాష్ట్ర కార్యాలయాన్ని సంప్రదించాలని లిఖితపూర్వక సమాధానమిచ్చారు. తమ డిమాండ్లకు పరిష్కారం చూపాలని ఇటీవల కురుపాం మండలానికి చెందిన నిమ్మక దివాకరరావుతోపాటు, మరికొంతమంది గిరిజన గురుకులాల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు పీజీఆర్‌ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. దీనికి పార్వతీపురం ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎండీ గయాజుద్దీన్ ఇచ్చిన సమాధానంతో నివ్వెరపోవడం వారి వంతైంది. ఉపాధ్యాయులు/అధ్యాపకులు ప్రస్తావించిన డిమాండ్ల పరిష్కారమేదీ తమ చేతిలో లేదని.. ఇక మీదట తాడేపల్లిలోని ఏపీటీడబ్ల్యూఆర్‌ఈఐ సొసైటీ, గురుకులం కార్యదర్శిని సంప్రదించాలని లిఖితపూర్వకంగా బదులిచ్చారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో సమస్యలు వెనువెంటనే పరిష్కారమవుతాయని ప్రభుత్వం చెప్పినందువల్లే ఇక్కడ ఫిర్యాదు చేశామని.. ఇప్పుడు అధికారులు తమ పరిధిలోనిది కాదని బదులిస్తూ.. తాడేపల్లిలో సంప్రదించాలని చెబితే ఇంకేం చేయగలమని వారంతా వాపోతున్నారు.

పాపం.. ఉపాధ్యాయులు!

తమ పోస్టులను డీఎస్సీలో చూపరాదని, ఉద్యోగ భద్రత కల్పించి.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, తమను సీఆర్‌టీలుగా మార్పు చేయాలని సుమారు రెండు వారాలుగా రాష్ట్రవ్యాప్తంగా గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు నిరసన చేపడుతున్నారు. జిల్లాలోనూ దాదాపు 200 మంది విధులను బహిష్కరించి పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల వద్ద రిలే దీక్షలు చేపడుతున్నారు. అసలే చాలీచాలని వేతనంతో కుటుంబాలను నెట్టుకురావడమే వీరికి కష్టంగా ఉంది. ఈ పరిస్థితుల్లో కొద్దిరోజులుగా విధులకు వెళ్లకపోవడం.. రిలే దీక్షలకు అయ్యే టెంట్లు, పూలదండలు, ఇతర నిర్వహణ ఖర్చులు వీరికి అదనపు భారంగా మారుతోంది. ఆర్థిక ఇబ్బందులను భరిస్తూనే నిరసనలకు హాజరవుతున్నారు. ప్రభుత్వం మానవతాదృక్పథంతో ఆలోచించి, వీరి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని గిరిజన, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

పర్యాటక అభివృద్ధిపై శ్రద్ధ చూపాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా పర్యాటక మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. సీతంపేట, పార్వతీపురం, సాలూరు, గుమ్మలక్ష్మీపురం ప్రాంతాల్లో జలపాతాలు, ప్రకృతి సిద్ధమైన ప్రదేశాలను కలుపుతూ సర్క్యూట్ టూరిజంను అభివృద్ధి చేయాలన్నారు. పెద్దగెడ్డ, వట్టిగెడ్డ జలాశయాలు, రేగావతి, సువర్ణముఖీ నదీ తీర ప్రాంతాలు, వీరఘట్టం వద్ద గల పెద్ద చెరువు తదితర ప్రదేశాల్లో వాటర్ పార్క్‌లను అభివృద్ధి చేసేందుకు అనుకూలమని స్పష్టం చేశారు. అడలిలో వీఐపీల కోసం గాజుతో తయారు చేసిన గదులను నిర్మించాలన్నారు. జిల్లాలోని దేవాలయాలను కలుపుతూ టెంపుల్ సర్క్యూట్ టూరిజంపై దృష్టిసారించాలన్నారు. సమావేశంలో జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, డీఎఫ్ఓ ప్రసూన, ఐటీడీఏల ఏపీఓలు పి. మురళీధర్, జి.చిన్నబాబు, జట్టు ట్రస్టీ డి.పారినాయుడు పాల్గొన్నారు.



- మెగా పేరెంట్స్ – టీచర్స్ డేకు అరకొర నిధులు
- నిధులు చాలవంటున్న ఉపాధ్యాయులు
- పార్వతీపురం మన్యం జిల్లాలోని సర్కారు బడులు : 1590
- జిల్లాకు కేటాయించిన నిధులు : రూ.27,53,800
- విజయనగరం జిల్లాలో సర్కారు బడులు : 1796
- జిల్లాకు కేటాయించిన నిధులు : రూ.34,11,200

వీరఘట్టం: రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 7న మెగా పేరెంట్స్ – టీచర్స్ డేను ప్రతీ పాఠశాలలో నిర్వహించాలని ప్రభుత్వం ఇటీవల విద్యా శాఖాధికారులను ఆదేశించింది. దీన్ని ఓ పండగలా చేపట్టాలని, ప్రతీ విద్యార్థి తల్లిదండ్రులకు, విద్యా కమిటీ సభ్యులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు ఆహ్వానించి స్కూల్ ప్రగతిని చాటి చెప్పాలని సూచించింది. ప్రతీ విద్యార్థి ప్రోగ్రెస్‌ను తల్లిదండ్రులకు తెలియజేయాలని చెప్పింది. ఈ మెగా ఈవెంట్‌ను అందరి భాగస్వామ్యంతో నిర్వహించాలని పేర్కొంది. అయితే ఇంతటి కార్యక్రమానికి నిధులు కూడా అవసరం ఉండడంతో విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా చేసుకుని ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్నట్టు రాష్ట్ర విద్యా శాఖ డైరెక్టర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు నిధుల కేటాయింపు చేశారు. అయితే కేటాయించిన నిధులు ఎటూ సరిపోవని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. పండగలా నిర్వహించాలని సూచించిన ప్రభుత్వం అరకొర నిధులతో ఎలా పండగ చేస్తామో చెప్పాలని ప్రశ్నిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 3,386 సర్కారు బడులు ఉన్నాయి. ఇందులో విజయనగరం జిల్లాలో ఉన్న 1796 పాఠశాలలు కాగా, పార్వతీపురం మన్యం జిల్లాలో 1590 సర్కారు బడులు ఉన్నాయి. వీటిలో పేరెంట్, టీచర్ సమావేశాలకుగాను విజయనగరం జిల్లాకు రూ.34,11,200 లను, పార్వతీపురం మన్యం జిల్లాకు రూ.27,53,800 లను విద్యార్థుల సంఖ్యను ప్రామాణికం చేసుకుని నిధులు కేటాయిస్తున్నట్లు ఉత్తర్వులు పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం చెప్పినట్లు కార్యక్రమం చేయాలంటే ఈ నిధులు చాలవంటూ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు పెదవి విరుస్తున్నాయి.

విద్యార్థుల సంఖ్యాధారంగా పాఠశాలలకు నిధులు కేటాయింపు ఇలా...

విద్యార్థుల సంఖ్య	కేటాయించిన నిధులు
0 - 10	రూ.1000
11 - 25	రూ.1200
26 - 50	రూ.1600
51 - 75	రూ.2000
76 - 100	రూ.2400
101 - 200	రూ.3000
201 - 300	రూ.4000
301 - 400	రూ.5000
401 - 500	రూ.6000
501 - 600	రూ.7000
601 - 700	రూ.8000
701 - 800	రూ.9000
801 - 900	రూ.10,000
901 - 1000	రూ.11,000
1001 - 1500	రూ.12,000
1501 - 2000	రూ.13,000
2001కి మించి విద్యార్థులు	రూ.14,000

గ్రాండ్‌గా నిర్వహించాలి



డిసెంబర్ 7న మెగా పేరెంట్స్–టీచర్స్‌డేను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. దీనిపై విధివిధానాలను ఇప్పటికే ఉపాధ్యాయులకు తెలియజేశాం. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా చేసుకుని ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని ఉత్తర్వులు వచ్చాయి. ఆ నిధులతో అందరి భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని నిర్వహించాలి.

– నల్ల తిరుపతినాయుడు, డీఈఓ, పార్వతీపురం మన్యం జిల్లా

నిధులు పెంచాలి



పేరెంట్స్ టీచర్స్ డేను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇది మంచి కార్యక్రమ మే. దీనికి సరిపడేలా నిధులు విడుదల చేయాలి. మైక్‌సెట్, షామియానా, పూలదండలు, భోజనాల ఖర్చులను పెరిగిన ధరలకు అనుగుణంగా కేటాయించాలి. లేదంటే ఉపాధ్యాయులకు చేతి చమురు వదులుతుంది. నిధులను పెంచాలి.

– మజ్జి పైడిరాజు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి, వీరఘట్టం

చాలీచాలని నిధులతో ఇబ్బందులే



పేరెంట్–టీచర్స్ సమావేశాన్ని గ్రాండ్‌గా చేయాలంటే నిధులు అవసరం ఉంది. కొన్ని చోట్ల దాతలు ముందుకు వస్తున్నారు. ఇంకొన్ని చోట్ల ఎవరూ ముందుకు రావడం లేదు. ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేస్తున్న చాలీచాలని నిధులతో ఈ కార్యక్రమాన్ని ఏ విధంగా చేయాలో అర్థం కావడం లేదు. నిధులు పెంచకపోతే ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పవు

– అన్ను వెంకటరావు, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం, రాష్ట్ర మీడియా సెల్ కన్వీనర్, వీరఘట్టం

ప్రభుత్వం పునరాలోచన చేసి పేరెంటు, టీచర్ డేకు నిధుల కేటాయింపు పెంచాలని కోరుతున్నాయి.

క్లుప్తంగా

పైడితల్లికి స్వర్ణపుష్పార్చన



స్వర్ణపుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారికి శుక్రవారం స్వర్ణ పుష్పార్చన సేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ నేతృత్వంలో వేకువజాము నుంచి అమ్మవారికి విశిష్ట పూజలు చేశారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

కందివలసలో ఏనుగుల సంచారం



కందివలస టమాటో తోటల్లో గజరాజుల గుంపు

కొమరాడ: మండల ప్రజలు, రైతులను గజరాజుల బెడద వీడడం లేదు. పగటి పూట ఆర్తాం కొండ ప్రాంతానికి చేరుకుని విశ్రాంతి తీసుకుని రాత్రి పూట కుమ్మరిగుంట పంటపొలాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు గడిచిన రెండు రోజులుగా కందివలస గ్రామంలోకి చొరబడ్డాయి. గ్రామ పరిసరాల్లో ఉన్న పామాయిల్, మోటార్ డ్రిప్ పరికరాలు, టమాటో తోటలు తొక్కుతూ జంఝావతి డ్యాం గట్టు దాటుకుని కోనవలస, లక్ష్మీపేట కొండ ప్రాంతానికి చేరుకున్నాయి. దీంతో రాజ్యలక్ష్మీపురం, కంబవలస, కందివలస తదితర గ్రామాల ప్రజలు గజరాజుల గుంపు ఏరాత్రి వచ్చి గ్రామంలోకి చొరబడతుందోనని బిక్కుబిక్కుమంటూ జీవనం గడపుతున్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ట్రాకర్స్ ఏనుగులు సంచారంపై కచ్చితమైన సమాచారం ఇవ్వాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

సౌత్‌వెస్ట్‌జోన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రిఫరీగా వెంకటేష్

బొండపల్లి: సౌత్ వెస్ట్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పురుషుల విభాగంలో నిర్వహిస్తున్న పోటీలకు రిఫరీగా వ్యవహరించే అవకాశం బొండపల్లి మండలంలోని అంబటివలస గ్రామానికి చెందిన వెయిట్ లిఫ్టర్ పాలూరి వెంకటేష్‌కు లభించింది. గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు రిఫరీగా వెంకటేష్‌ను ఎంపిక చేయడంతో ప్రసుత్తం యూనివర్సిటీలో జరుగుతున్న పురుషుల విభాగంలో పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు రిఫరీగా ఆయన వ్యవహరిస్తున్నారు. మారుమూల ప్రాంతం నుంచి వెయిట్ లిఫ్టర్‌గా ఎదిగి అనేక పతకాలు సాధించి ఇప్పుడు రిఫరీగా వ్యవహరిస్తుండడంతో గ్రామస్తులు అభినందిస్తున్నారు.

నాటుతుపాకీతో కాల్పులు జరిపిన వ్యక్తి అరెస్టు

సీతంపేట: మండలంలోని దుగ్గి గ్రామంలో నాటుతుపాకీతో కాల్పులు జరిపి ఓ వ్యక్తిని గాయపర్చిన సంఘటనలో అదే గ్రామానికి చెందిన కొండగొర్రె రాజేష్‌ను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అనంతరం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మస్తాన్ తెలిపారు. తుపాకీ కాల్పుల్లో గాయపడిన లక్కాయి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడని చెప్పారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండలం జి.శివడ గ్రామానికి చెందిన దేవరాపు త్రినాథం(54) పాముకాటుకు గురై చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు నీలకంఠాపురం ఎస్సై నీలకంఠారావు తెలిపిన వివరాల మేరకు గురువారం సాయంత్రం గ్రామం సమీపంలో పొలం పనులు చేస్తుండగా పాము కరిచిందని, ఇంటికి వచ్చాక కుటుంబసభ్యులకు తెలియపర్చగా..వెంటనే గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి సీహెచ్‌సీకి తీసుకువెళ్లగా వైద్యులు చికిత్స అందిస్తుండగా రాత్రి మృతిచెందాడు. పాముకాటుకు గురైన తర్వాత ప్రాథమిక చర్యలేవీ చేపట్టలేదని, ఆస్పత్రికి వచ్చే లోపే విషం శరీరమంతా పాకిందని, వైద్యం అందించినా ఫలితం లేకుండా పోయిందని వైద్యులు తెలిపారు. ఈ సంఘటనపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య రమణమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹127	₹227	₹234

మహిళా మణులకు సెల్యూట్..!

- మహిళల కన్యాశుల్కం నాటిక ప్రదర్శనకు అపూర్వ ఆదరణ
- రాష్ట్రస్థాయిలో పలు ప్రదర్శనలు
- మహాకవి గురజాడ వర్ధంతి నేడు



కన్యాశుల్కం నాటికలో మహిళా నటులకు సూచనలు చేస్తున్న దర్శకుడు



మహిళల కన్యాశుల్కం టీమ్



మధురవాణి ఇంట్లో మంచం సీన్ (ఫైల్)



గిరీశం పాత్రధారిలో వెంకటేశానికి సూర్యలక్ష్మి ధైర్యం చెబుతున్న దృశ్యం (ఫైల్)

విజయనగరం టౌన్: వందేళ్ల క్రితమే మహాకవి ముందుచూపు చూశారు. సమాజంలోని రుగ్మతలను, సాంఘిక దురాచారాలను తనదైనశైలిలో రచిం చారు. నాటికీ నేటికీ మహాకవి గురజాడ భావితరాలకు అడుగుజాడగా నిలిచారు. ఆయన రూపొందించిన కన్యాశుల్కం నాటిక అజరామరంగా నిలబడిందంటే ఆ మహనీయుని దార్శనికత వర్ణనాతీతం. అటువంటి కన్యాశుల్కం నాటిక ప్రదర్శనను విజయనగరం గడ్డపైన మహిళలు ప్రదర్శించడం ప్రపంచ చరిత్రలో లిఖించగిన అంశం. కన్యాశుల్కం నాటకాన్ని ఎంతోమంది కళాకారులు తమ హావభావాలతో ప్రదర్శించినప్పటికీ, మహిళలు ముందుకు వచ్చి కేవలం మహిళలతోనే కన్యాశుల్కం నాటిక ప్రదర్శించడం చాలా క్లిష్టతరమైనపని. అటువంటిది లేడీస్ క్లబ్, రిక్రియేషన్ క్లబ్ మెంబర్‌గా ఉంటూ గురజాడ సాంస్కృతిక సమాఖ్యలో సేవలందిస్తున్న భోగరాజు సూర్యలక్ష్మికి వచ్చిన ఆలోచనతో దర్శకత్వ బాధ్యతలు చేపట్టిన ఈపు విజయకుమార్ నేతృత్వంలో నాటకం ఊపిరిలూదుకుంది. దీంతో తొలిసారిగా 2017లో ఐదుగురితో కలిసి 40 నిమిషాల పాటు ప్రదర్శించి అందరి మన్ననలు పొందారు. అక్కడితో ఆగిపోకుండా రాష్ట్రస్థాయిలో అనేక ప్రదర్శనలు ఇచ్చారు. 2019లో సెప్టెంబరు 21న గురజాడ జయంతి రోజున ఆ మహాకవి పుట్టిన ఊరు ఎస్.రాయవరంలో మహిళలు కన్యాశుల్కం నాటిక ప్రదర్శించి మహాకవికి ఘనంగా నివాళులర్పించారు. విజయనగరం, బొబ్బిలి, కాకినాడ, గుంటూరు, భీమవరం, ఎస్.రాయవరం తదితర ప్రాంతాల్లో కన్యాశుల్కం నాటిక ప్రదర్శించి ఆహూతుల మన్ననలు పొందారు. తాజాగా శుక్రవారం కాకినాడలో రెండు గంటల నిడివిలో కన్యాశుల్కం నాటిక ప్రదర్శించినట్లు నిర్వాహకులు తెలిపారు. జాతీయస్థాయిలో దేశవ్యాప్తంగా మహిళలు కన్యాశుల్కం నాటిక ప్రదర్శన తమ లక్ష్యమని, మహాకవి గురజాడను విశ్వవ్యాప్తం చేస్తామని మహిళలు ఘంటాపథంగా చెబుతుండడం విశేషం. అదేవిధంగా గతంలో కేవలం బొంకులదిబ్బ, అగ్నిహోత్రావధానుల సీన్‌లు వేసేవారు. నేడు రెండు గంటల నిడివిలో బొంకులదిబ్బ, మధురవాణి ఇంట్లో మంచంసీన్, అగ్నిహోత్రావధానుల ఇంట్లో తాంబూలాలిచ్చేశాం..తన్నుకు చావండి' అనే సన్నివేశాలను, సౌజన్యరావు పంతులు ఇంట్లో పడక గది సీన్‌తో పాటు మరికొన్నింటిని నాటకంగా ప్రదర్శించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

పాత్రధారులు వీరే..

కేవలం 40 నిమిషాల నిడివిలో రెండు సన్నివేశాలను మాత్రమే ప్రదర్శిస్తూ అందరి మన్ననలు పొందిన మహిళలందరూ నేడు ఒకడుగు ముందుకేసి రెండు గంటల పాటు ప్రదర్శన ఇవ్వడం సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తోంది. వయోవృద్ధులైన మహిళలు సైతం కీలకపాత్రలు పోషిస్తూ మన్ననలు పొందుతున్నారు. గిరీశంగా భోగరాజు సూర్యలక్ష్మి, రామప్ప పంతులుగా సీహెచ్.రాజకుమారి, కరటక శాస్త్రిగా ముళ్లపూడి సుభద్రాదేవి, అగ్నిహోత్రావధానులుగా సామవేదుల గీతారాణి, పూటకూళ్లమ్మ, ఫొటోగ్రాఫర్ పంతులు నౌకరుగా సామవేదుల సత్యలత, వెంకమ్మగా ఉదయగిరి నీలిమ, మధురవాణిగా సీతామహాలక్ష్మి, సౌజన్యారావు పంతులుగా చీకటి చంద్రికారాణి, వెంకటేశంగా వాకా దేదీప్య పాత్రలను పోషిస్తున్నారు. ఆర్గనైజర్‌గా భోగరాజు సూర్యలక్ష్మి, దర్శకత్వం, నిర్వహణ బాధ్యతలు ఈపు విజయకుమార్ నిర్వహిస్తున్నారు.

కన్యాశుల్కం అజరామరం



130 ఏళ్ల క్రితమే దురాచారాలపై నాటకం రాసి గురజాడ సామాజిక విప్లవం సృష్టించారు. విజయసూర్య ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలతో నాటికను ప్రదర్శించడం ఎంతో ఆనందదాయకం. గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ అందిస్తున్న సహకారం ఎనలేనిది. మహాకవి నడయాడిన నేలపై ఆయన సాహితీ వారసులుగా మహిళలతోనే చేపట్టే ఈ కన్యాశుల్కం నాటకం దేశమంతా ప్రదర్శించాలన్నదే మా లక్ష్యం.

– ఈపు విజయకుమార్, దర్శకుడు, విజయనగరం

కుటుంబ సభ్యుల సహకారం ఎనలేనిది



మహాకవి గురజాడ రచించిన కన్యాశుల్కం నాటిక మహిళలతో ప్రదర్శింపు చేయాలన్న సంకల్పం సత్ఫలితాలనిచ్చింది. నా భర్త భోగరాజు బాబూజీ సహకారంతో నా పెద్దకుమారుడు భోగరాజు కౌండిన్య చిన్నతనంలో గొల్లపూడి మారుతీరావు, రావికొండలరావులతో కలిసి కన్యాశుల్కం నాటకంలో వెంకటేశంగా నటించాడు. మా చిన్నవాడు శాండిల్య లుబ్ధావధానులుగా ఏకపాత్రాభినయం ప్రదర్శించి అందరి మన్ననలు పొందాడు. ఆ కోవలోనే మహిళలతో కన్యాశుల్కం నాటిక ప్రదర్శింపజేయాలనే ఆలోచన నాకు తట్టడం, రాష్ట్రస్థాయిలో ప్రదర్శనలిస్తుండడం మహాకవి సాహితీవారసులుగా నడవడం ఆనందంగా ఉంది. మహిళల కన్యాశుల్కంలో గిరీశంగా నటిస్తుంటే చెప్పలేనంత సంతోషం కలుగుతోంది.

– భోగరాజు సూర్యలక్ష్మి, ఆర్గనైజర్, విజయనగరం

అదానీపై చర్యలకు తాత్సారం ఎందుకు?

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విజయనగరం పూల్‌బాగ్: విద్యుత్ కొనుగోళ్లపై ప్రజలందరూ చర్చించుకుంటున్నా, తమకేమీ తెలియదన్నట్టుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవహరిస్తున్నారని, సమాచారం సేకరిస్తున్నామంటూ బుకాయిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. విజయనగరంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ శక్తుల ఆదేశాలతో దేశాన్ని పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం, దానికి తొత్తులుగా ఉన్న కూటమి ప్రభుత్వాలు అదానీ విషయంలో చర్యలకు కావాలనే తాత్సారం చేస్తున్నాయని విమర్శించారు. బీజేపీతో అంటకాగడం వల్లే అదానీకి మద్దతుగా విద్యుత్ కొనుగోళ్లపై చంద్రబాబు స్పందించడంలేదన్నారు. సెకీతో విద్యుత్ ఒప్పందం వల్ల రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారం పడుతుందని సీపీఐ హెచ్చరించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ అంశంపై చివరకు తాను హైకోర్టులో రిట్ వేసినట్టు వెల్లడించారు. ప్రస్తుతం ఆర్థికమంత్రిగా ఉన్న పయ్యావుల కేశవ్ కూడా కోర్టులో పిల్ దాఖలు చేశారని తెలిపారు. కోర్టులో కేసు వేయడంతో అజీజ్ పవార్ కంపెనీ విద్యుత్ సరఫరాలో వెనక్కి తగ్గిందన్నారు. అదానీ మాత్రం దాదాపు 7 వేల మెగా వాట్ల విద్యుత్ సరఫరా చేసి రాష్ట్ర ప్రజలపై ఒక లక్షా పదివేల కోట్లు భారాన్ని వేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో ఆధారాలు లభించినా ముఖ్యమంత్రి ఆలోచన చేయడం అనుమానాలకు తావిస్తోందన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు, జిల్లా సీపీఐ కార్యదర్శి ఒమ్మి రమణ, సహాయ కార్యదర్శులు బుగత అశోక్, అలమండ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్య సారథి గురజాడ



గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

విజయనగరం: గురజాడ అప్పారావు అభ్యుదయవాది, తెలుగు సాహిత్య సారథి. కన్యాశుల్కం పేరుతో జరుగుతున్న సాంఘిక దురాచారపు వికృత రక్కసి కోరల నుంచి ఆడవారిని కాపాడారు. సంఘంపై సమర శంఖాన్ని గురజాడ పూరించగా చీకటి తెరలు తొలగిపోయి జ్ఞానకిరణాలు ఉత్తేజితమయ్యాయని జిల్లా పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖాధికారి కుమారస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో గురజాడ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. గురజాడ పేరు తలుచుకున్నప్పుడల్లా నరనరాల్లో మానవత్వం పొంగి మానవతా వాదాన్ని మనసు నిన దిస్తుందన్నారు. సమితి అధ్యక్షుడు గురుప్రసాద్ మాట్లాడుతూ తెలుగు జాతి వెలుగుజాడ గురజాడ రాసిన గీతం 'దేశమును ప్రేమించుమన్నా కొన్ని కోట్ల తెలుగుప్రజల పెదాలపై కోట్లసార్లు నర్తించి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ముందుగా గురజాడ చిత్రపటానికి అంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీలలో విజేతలకు బహుమతులను, పతకాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ మిషన్ సేవలు స్ఫూర్తిదాయకం

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్




విద్యార్థులకు బహుమతి ప్రోత్సాహకాలను అందిస్తున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం రూరల్: లెప్రసీ మిషన్ సమాజానికి అందిస్తున్న సేవలు పలువురికి స్ఫూర్తి దాయకమని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రశంసించారు. ఈ మేరకు విజయనగరం మండలంలోని చెల్లూరు గ్రామ సమీపంలో ఉన్న లెప్రసీ మిషన్ 150వ వసంత వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ అక్కడ శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడారు.అలాగే వారు రూపొందించిన వివిధ కళాకృతులను తిలకించారు. అనంతరం మాట్లాడుతూ లెప్రసీ మిషన్ సేవలను వందేళ్లకు పైగా కొనసాగించడం అభినందనీయమన్నారు. ఎంతోమంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దారని ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ఈ సంస్థ సేవలు మరింత మరింత ముందుకు కొనసాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ కె.రాణి, సంస్థ ప్రిన్సిపాల్ గాబ్రియేల్, ఇతర ప్రతినిధులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యను నేర్వాలి

- కేంద్ర మాజీ మంత్రి, మాన్సాస్ ఛైర్మన్ అశోక్ గజపతిరాజు
- ముగిసిన ఏఐఎస్‌ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలు



విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతున్న అశోక్‌గజపతిరాజు

విజయనగరం పూల్‌బాగ్: ప్రస్తుతం విద్యావ్యవస్థ అధ్వానంగా మారిందని, ఇటువంటి సమయంలోనే విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాల్సిన అవసరం విద్యార్థులకు ఉందని కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు సూచించారు. ఏఐఎస్‌ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలు విజయనగరంలో జరుగుతున్న సందర్భంగా శుక్రవారం ముగింపు రోజున ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోనూ ఆలోచనా శక్తి ఉంటుందని, దానికి పదును పెట్టాలని సూచించారు. విద్యతోనే మీకు మీకుటుంబానికి, సమాజానికి న్యాయం చేయగలరన్నారు. దేశమును ప్రేమించుమన్నా. మంచి అన్నది పెంచుమన్నా.. అనేది కేవలం మిమ్మల్ని ఉద్దేశించి చెప్పినదిగా భావించాలని కోరారు. ప్రతి ఒక్కరూ సమాజానికి ఉపయోగపడేలా నడుచుకోవాలని హితవు పలికారు. ప్రస్తుతం విద్యావిధానం చూస్తే ఆశ్చర్యం కలుగుతోందన్నారు. ఉత్తరాంధ్ర నుంచే అనేకమంది విద్యాశాఖమంత్రులు పనిచేశారని, కానీ 1050 పాఠశాలలు మూసివేశారని ఆందోళన వ్యక్తం చేశారు.

అధ్వానంగా హాస్టల్స్

మరోముఖ్యఅతిథిగా హాజరైన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ మీ పోరాటాల కారణంగా అనేక సమస్యలు పరిష్కారమవుతాయని, ఏఐఎస్‌ఎఫ్ అంటే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న చరిత్ర కలిగిన సంస్థ అని కొనియాడారు. మీలాంటి విద్యార్థి నేతలే రేపటి సమాజంలో ప్రశ్నించే నేతలుగా మారుతారన్నారు. నేడు వసతి గృహాల పరిస్థితి అధానంగా ఉందని తాను తనిఖీ చేసే సమయంలో లోపాలు బయటపడ్డాయన్నారు. సమస్యలపై పోరాడే సమయంలో తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. మహాసభల ఆహ్వానసంఘం అధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మంచి విద్యావంతులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. నీతి నిజాయితీలతో జీవించాలని, సమాజంలో ఆడపిల్లలపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో వారికి ఏఐఎస్‌ఎఫ్ రక్షణగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా అతిథులుగా విచ్చేసిన వారికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ గౌరవ సత్కారం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మిరమణ, సహాయ కార్యదర్శులు బుగత అశోక్, అలమండ ఆనందరావు, ఏఐఎస్‌ఎఫ్ జాతీయ ప్రధానకార్యదర్శి దినేష్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.జాన్సన్‌బాబు, శివారెడ్డి పాల్గొన్నారు.

కరాటేలో బుడతడి ప్రతిభ



కరాటేలో ప్రతిభ కనబర్చిన యాగ్నిక్

సీతంపేట: ఇన్విటేషనల్ ఇంటర్‌స్టేట్ కరాటే పోటీల్లో సీతంపేట మండలంలోని పెద్దూరుకు చెందిన ఐదేళ్ల బాలుడు ఆరిక యాగ్నిక్ మంచి ప్రతిభ కనబర్చాడు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన అండర్ ఏజ్ కేటగిరి కాటా విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించాడు. ఆ బాలుడిని తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు బాడంగి విద్యార్థులు



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వారితో టీచర్లు

బాడంగి: జాతీయస్థాయిలో జరగనున్న బేస్‌బాల్ పోటీలకు బాడంగి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు కోరాడపవన్, కండి రమ్య ఎంపికైనట్లు పీడీ బంగారునాయుడు శుక్రవారం తెలిపారు. స్కూల్‌గేమ్స్ తరపున తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ క్రీడల్లో పాల్గొని ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులతో పాటు వారికి శిక్షణ నిచ్చిన పీడీ బంగారు నాయుడిని హెచ్‌ఎం సత్యనారాయణ, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎల్.గోవిందరావు, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

చోరీ కేసులో నిందితుడికి రిమాండ్

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గేటు సమీపంలో ఉంటున్న అచ్చియ్యశెట్టి ఇంట్లో 2023వ సంవత్సరంలో జరిగిన దొంగతనంలో పట్టుబడిన తాడి తరుణ్‌కుమార్ ఆనే నిందితుడికి కొత్తవలస జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి 14రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ షణ్ముఖరావు తెలిపారు. అచ్చియ్యశెట్టి ఇంట్లో 2023 డిసెంబర్‌లో దొంగతనం జరిగింది.అప్పట్లో తలుపులు విరగ్గొట్టి సుమారు రెండుతులాల బంగారం చోరీ చేశారు. అయితే గురువారం కొత్తవలస జంక్షన్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న గంట్యాడ మండల కేంద్రానికి చెందిన తరుణ్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేయగా పైన తెలిపిన ఇంట్లో తానే దొంగతనం చేసినట్లు నేరం అంగీకరించడంతో ఆరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట శుక్రవారం హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సీఐ వివరించారు.

రామతీర్థంలో సహస్ర దీపాలంకరణ



స్వామి వారి సన్నిధిలో సహస్ర దీపారాధన కార్యక్రమం

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతా రామస్వామివారి దేవస్థానంలో స్వామివారికి సహస్ర దీపాలంకరణ సేవ శుక్రవారం కనుల పండువగా సాగింది. కార్తీక శుక్రవారం సందర్భంగా సాయంత్రం స్వామివారి ఆస్థాన కల్యాణ మంటపంలో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో దీపాలను వెలిగించారు. ఆలయ అర్చకులు ముందుగా స్వామివారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలను చేపట్టారు. అనంతరం వేద మంత్రోచ్చారణల నడుమ కల్యాణ మంటపంలో ఉన్న ప్రత్యేక ఊయలలో స్వామివారిని వేంచేపు చేసి ఊంజల్ సేవను వైభవంగా జరిపించారు. భక్తులే స్వయంగా స్వామివారికి దీపాలంకరణ సేవ చేసే భాగ్యం కలగడంతో చుట్టు పక్కల గ్రామాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి సహస్ర దీపాలను వెలిగించారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బందితో పాటు సమీప గ్రామాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికే 'వెల్ఫేర్ డే'



సమస్యలు వింటున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీస్ వెల్ఫేర్‌డేను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సమస్యలను ఆయన తెలుసుకుని విజ్ఞాపనలు స్వీకరించారు. సిబ్బంది విజ్ఞాపనలు పరిశీలించిన ఎస్పీ వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. పోలీసు సిబ్బంది తెలిపిన వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను స్వయంగా నోట్ చేసుకుని, వాటి పూర్వాపరాలు పరిశీలించి, పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతానని ఎస్పీ హామీ ఇచ్చారు.

సినీఫక్కీలో చోరీ



సూర్యకుమార్ ఇంట్లో చోరీ జరిగిన బీరువా ఇదే

పూసపాటిరేగ: మండలంలోని సీహెచ్ అగ్రహారంలో ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో శుక్రవారం సినీఫక్కీలో చోరీ జరిగింది. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పొట్టేలు సూర్యకుమార్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ అగంతుకుడు ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న తులం బంగారం, రూ.10 వేలు, సెల్‌ఫోన్ దొంగిలించినట్లు బాధితులు తెలియజేశారు. సూర్యకుమార్ పరిశ్రమలో విధులకు వెళ్లిపోగా, భార్య జానకి గ్రామం సమీపంలో గల శివాలయంలో అన్నదానం కార్యక్రమానికి వెళ్లిన సమయంలో ఇంట్లో చోరీ జరిగినట్లు బాధితులు తెలియజేశారు. అగంతుకుడు ఆ ఇంట్లో ఉన్న సమయంలోనే పెండ్లికార్డుతో ఆహ్వానించేందుకు సూర్యకుమార్ బంధువులు వచ్చారు. వారిని అగంతుకుడు తప్పుదోవ పట్టించి, ఇంటి గల వ్యక్తులకు ప్రమాదం జరిగిందని తెలియజేయడంతో అక్కడి నుంచి బంధువులు వెళ్లిపోయారు. దీంతో అగంతుకుడు పరారయ్యాడు. ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని పూసపాటిరేగ పోలీసులు సందర్శించి విచారణ చేపట్టారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు పయనమవుతున్న జిల్లా క్రీడాకారులు

విజయనగరం: 29వ సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు విజయనగరం జిల్లా నుంచి క్రీడాకారులు శుక్రవారం పయనమయ్యారు. ఈనెల 30 నుంచి డిసెంబర్ 1 వరకు మందడం(అమరావతి)లో పోటీలు జరగనుండగా..విజయనగరం జిల్లా నుంచి 13 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ మేరకు క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ అసోయేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఉత్తమప్రతిభ కనబరిచి పతకాలు సాధించడంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్ రాజు, సెపక్‌తక్రా అసోసియేషన్ సెక్రటరీ ఎం.టి.రాజేష్ పాల్గొన్నారు.